సమ్మెతో నీటికి కటకట

- సమ్మెబాట పట్టిన వాటర్ వర్క్స కార్మికులు
- కార్మికులు లేక కార్పొరేటరే నీటిని విడుదల చేస్తున్న వైనం
- అరకొరగా నీటిసరఫరా
- సకాలంలో నీరు అందక ఇబ్బందుల్లో పశ్చిమవాసులు


సమ్మె చేస్తున్న వీఎంసీ కాంట్రాక్టు కార్మికులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజక వర్గ ప్రజలు మంచినీటికి కటకటలాడుతున్నారు. నగరపాలకసంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెబాట పట్టడంతో నియోజకవర్గంలో నీటిసరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ వాటర్ వర్క్స, పార్కులు, స్ట్రీట్‌లైట్స్, యుజీడీ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెకు దిగారు. నియోజకవర్గంలో వాటర్ వర్క్సకు సంబంధించి పనిచేస్తున్న సుమారు 150మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటుండటంతో నీటి సరఫరాకు తీవ్ర అవరోధాలు ఏర్పడ్డాయి. దీంతో సరిపడినంత మంచినీరు అందక ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అరకొరగానే అందుతున్న నీరు...

నియోజకవర్గంలో మంచినీరు సరిపడనంత అందక పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. ముఖ్యంగా హెడ్ వాటర్ వర్క్స నుంచి వచ్చే నీటిని స్థానికంగా ఉండే ఆయా వాటర్ ట్యాంక్‌ల్లోకి బూస్టర్లు, ఇతర మోటార్ల సాయంతో నింపాల్సి ఉంటుంది. అవి నిండిన తరువాత ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో ఆయా స్థానిక ప్రాంతాలకు మంచినీటిని వదలాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది సమ్మె బాట పట్టడంతో ఉన్న పర్మినెంట్ సిబ్బంది, వివిధ రూపాల్లో పని చేస్తున్న తాత్కాలిక సిబ్బందికి ఒక్కరికే నాలుగైదు బాధ్యతలు అప్పగించి పనులను నిర్వహింపజేస్తున్నారు. అయినా నీటిసరఫరా యథావిధిగా సాగకపోవడంతో ప్రజలకు అరకొర నీరే అందుతోంది. ఉదయం సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేసినప్పుడు ప్రజలు వాటిని పట్టుకుని నిల్వ చేసుకుంటారు. అయితే కొద్దిసేపటికే నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అలాగే భవనాల్లో నివాసాలు ఉండే నివాసితులు తమ ట్యాంక్‌లను సైతం మోటార్ల ద్వారా నీటిని నింపుకుని వాడుకుంటారు. మోటర్లు పనిచేస్తున్న వాటికి కూడా నీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో మంచినీటి కోసం కటకటలాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటరే నీటిని విడుదల చేస్తున్న వైనం..

కార్మికులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక స్థానిక ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులు భరించలేక ఒకరిద్దరు కార్పొరేటర్లే స్వయంగా నీటిని ట్యాంకుల్లో నింపే పనులు చేపడుతున్నారు. అనంతరం ఆ నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పాత బస్తీలోని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తన డివిజన్‌లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతూ ఫిర్యాదులు చేస్తుండటంతో ఆయనే ట్యాంక్‌కు నీటిని ఎక్కించి, ప్రజలకు సరఫరా చేసే పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తుండటం పరిస్థితికి అద్దంపడుతోంది.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి..



నగరపాలకసంస్థ కాంట్రాక్టు సిబ్బంది సమ్మెకు దిగడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నీటి సరఫరాకు సంబంధించి పలు ప్రాంతాల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిపై ప్రభుత్వం స్పందించాలి. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలుచేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి మంచినీటి సరఫరా సజావుగా సాగేలా చూడాలి.

–బోయి సత్యబాబు, సీపీఎం ఫ్లోర్‌లీడర్

క్లుప్తంగా

వృద్ధులకు నూతన వస్త్రాలు, మందుల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురంలోని శ్రీవెంకటసాయిశ్రీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం భారతీయ (ఇండియన్) హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు నూతన వస్త్రాలు, మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ఎం.పవన్ కల్యాణ్, డైరెక్టర్ డాక్టర్ భుజంగనాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల పరిరక్షణతోపాటు ఏటాడా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్, స్టేట్ లీగల్ సెల్ ప్రతినిధి వి.గోపీకాంత్, ఉమెన్స్ వింగ్ ప్రతినిధి చల్లపల్లి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధి 'కళ్లేపల్లి' కృషి



భవానీపురం(విజయవాడపశ్చిమ): మూతపడుతున్న అనేక గ్రంథాలయాలను పునరుద్ధరించి వాటి అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి డాక్టర్ కళ్లేపల్లి మధుసూదనరాజు అభినందనీయుడని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ కొనియాడారు. విద్యాధరపురంలోని ఎన్.కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం గ్రేడ్–3 గ్రంథాలయ అధికారి డాక్టర్ కళ్లేపల్లి మధుసూదనరాజు ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రంథాలయశాఖలో చిరు ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన మధుసూదనరాజు అంచెలంచెలుగా ఎదిగి గ్రంథాలయ ఉద్యోగుల సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేయటం ఆయన నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ ఎంపీ, లైలా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ గ్రంథాలయాల పురోభివృద్ధికి ఎంతో కృషి చేసిన మధుసూదనరాజు తనను కూడా ఆకార్యక్రమంలో భాగస్వామ్యుడిని చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఏపీ పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి మూతపడే స్థితిలో ఉన్న గ్రంథాలయాలను పునరుద్ధరణకు కృషిచేసిన మధుసూదనరాజు అభినందనీయుడని అన్నారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ చైర్మన్ బండారు హనుమంతరావు, వేగిరాజు, పబ్లిక్ లైబ్రరీస్ డీడీ పీర్ అహ్మద్, ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం, రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్స్ అసోసియేషన్, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం, స్టేట్ వైడ్ శోభన్‌బాబు సిండికేట్ నాయకులు పాల్గొని మధుసూధనరాజు–పార్వతి దంపతులను ఘనంగా సత్కరించారు.

మహాప్రస్థానం కవితా సంపుటి పెనుసంచలనం

విజయవాడ కల్చరల్: ప్రజాకవి శ్రీశ్రీ అని విశ్రాంత కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి శ్రీశ్రీ సాహిత్యనిధి ఆధ్వర్యంలో న్యాయవాది వేములపాటి పట్టాభికి ఆత్మీయ సత్కారం, శ్రీశ్రీ మహాప్రస్తానం గ్రంథాల బహూకరణ కార్యక్రమాన్ని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో వేములపాటి అనంతరామయ్య కళావేదికమీద నిర్వహించారు. ఇంతియాజ్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మహాప్రస్థానం కవితా సంపుటి పెనుసంచలనం సృష్టించిందన్నారు. సభాధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ శ్రీశ్రీకి అంతరంగిక శిష్యులు కొంతమంది ఉన్నారని వారిలో వేములపాటి అనంతరామయ్య ఒకరన్నారు. శ్రీశ్రీ సాహిత్య నిధి నిర్వాహకుడు సింగంపల్లి అశోక్ కుమార్ శ్రీశ్రీ సాహిత్యాన్ని అభిమానులకు అందిస్తునట్లు తెలిపారు. న్యాయవాది వేములపాటి పట్టాభిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. న్యాయవాది మోహన్ రాంప్రసాద్ మహాప్రస్థానం గీతాన్ని గాయకుడు సుదర్శన్‌రాజు శ్రీశ్రీ సినిమా పాటలను ఆలపించారు.

కాపుల సంక్షేమానికి పాటుపడాలి


బత్తుల దుర్గారావును అభినందిస్తున్న కాపుసంఘ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాపుల సంక్షేమానికి పాటుపడాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు పిలుపునిచ్చారు. ప్రజాకాపునాడు సంక్షేమ సంఘం పశ్చిమ నియోజకవర్గం కమిటీని నియమించారు. సంఘ స్థానిక కార్యాలయంలో అధ్యక్షునిగా నియమితులైన బత్తుల దుర్గారావు ఉపాధ్యక్షులు పైడి వెంకటేశ్వరరావు, గుండు మహేష్, కార్యదర్శులు కర్రి గౌరి, రామిశెట్టి గోపి తదితరులకు నియామకపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కాపుల సంక్షేమానికి, అభ్యున్నతికి, ఐక్యతకు కృషి చేయాలని నూతన కార్యవర్గాన్ని కోరారు. పేద కాపు కుటుంబాల కోసం పెళ్లికానుక పథకాన్ని ప్రవేశ పెట్టాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. పశ్చిమంలో కాపు కల్యాణ మండపానికి కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షునిగా నియమితులైన బత్తుల దుర్గారావు మాట్లాడుతూ తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు, ఇతర నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యలకల చలపతిరావు, వివిధ సంఘాల ప్రతినిధులు కూరాకుల నాగ, బొమ్మ మధు, బత్తిన నాగపావని, నంది బాబూరావు, వెన్నం రత్నారావు, దొడ్డ రాజా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హాకర్ల జీవనోపాధిని కాపాడాలని డిమాండ్


వన్‌టౌన్ పీఎస్‌లో హాకర్లతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గగుడి పరిసరాల్లో వ్యాపారాలను నిర్వహించే హాకర్ల జీవనోపాధిని కాపాడాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. వారిపై అక్రమ అరెస్టులు, బైండోవర్ కేసులు ఆపాలని కోరారు. దుర్గగుడి దిగువన వివిధ ప్రాంతాల్లో హాకర్లు నిర్వహించుకునే చిరు వ్యాపారాలను అధికారులు శనివారం రాత్రి నుంచి తొలగించారు. ఈక్రమంలో ఆదివారం ఆ ప్రాంతానికి చేరుకున్న హాకర్లను వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బోయి సత్యబాబు, ఇతర నేతలు స్టేషన్ వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ 30ఏళ్లుగా దుర్గగుడి పరిసరాల్లో భక్తులకు సరసమైన ధరలకే పూజా సామగ్రి విక్రయిస్తున్న హాకర్ల ఉపాధి దెబ్బతీయడం తగదన్నారు. అన్యాయంగా బుల్డోజర్లతో వారి షాపులను ధ్వంసం చేయడం పోలీసు నిర్బంధంతో అణిచివేయడం దుర్మార్గమన్నారు. ఇదేనా రాష్ట్ర ప్రభుత్వం తొలిఅడుగు? అని ప్రశ్నించారు. హాకర్లు తమ పరిస్థితిపై రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి పశ్చిమ శాసనసభ్యులకు మొరపెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. హాకర్ల గోడు వినకుండా ప్రజాప్రతినిధులను కలిసేందుకు బయలుదేరిన వారిని అన్యాయంగా అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ఉదయం 9:30 నుండి సాయంత్రం 6:30 వరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం ఇది ప్రజాస్వామ్యమా? లేక నియంతృత్వమా? అని మండిపడ్డారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను స్వయం ఉపాధి పథకాలతో కోటీశ్వరులు చేస్తామని మాటలు చెప్పి, నేడు స్వయం ఉపాధితో జీవనం పొందుతున్న వారిని రోడ్డుపాలు చేయడం ఎంతవరకు సమంజసమని ఎద్దేవా చేశారు. హాకర్లకు న్యాయం చేయాలని కోరారు. హాకర్లను పరామర్శించిన వారిలో సీఐటీయూ పశ్చిమ కార్యదర్శి ఈవీ నారాయణ, ఉపాధ్యక్షులు వి.సాములు, మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి జ్యోతి తదితరులు ఉన్నారు.

పూర్తయిన ఆక్రమణల తొలగింపు

- దేవస్థాన స్థలం చుట్టూ ఫెన్సింగ్
- రథం సెంటర్‌లో దేవస్థాన కౌంటర్లు


ఆక్రమణల తొలగింపు అనంతరం వ్యర్థాలను తరలిస్తున్న దేవస్థాన సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ఆదివారం తెల్లవారుజాము ఐదు గంటలకు పూర్తయింది. కనకదుర్గనగర్ నుంచి రథంసెంటర్ వరకు దేవస్థాన స్థలంలో ఆక్రమణలతోపాటు చైనావాల్, విజయేశ్వర స్వామి వారి ఆలయం, కనకదుర్గనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, బడ్డీలను తొలగించారు. మరో వైపున రథం సెంటర్ వరకు ఉన్న దేవస్థాన స్థలం తిరిగి ఆక్రమణలకు గురికాకుండా ఐరన్ గడ్డర్లతో కూడిన ఐరన్‌మెస్ ఏర్పాటు చేశారు. మరో వైపున కనకదుర్గనగర్ పరిసరాల్లోని దుకాణాలను నిర్వహిస్తున్న మహిళలు, చిరువ్యాపారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఆలయం వద్దకు చేరి ఆందోళన నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సుమారు 30 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

రథంసెంటర్ వద్ద దేవస్థాన కౌంటర్లు

రథం సెంటర్‌లోని దేవస్థాన స్థలంలో కౌంటర్ల ఏర్పాటుకు ఆలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అమ్మవారి దర్శన టికెట్లతోపాటు ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేసి సేవలను భక్తులకు మరింత చేరువ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంత్రి దృష్టికి ఆక్రమణల తొలగింపు..

ఆక్రమణల తొలగింపు విషయాన్ని ఆలయ ఈవో శీనానాయక్ ఆదివారం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో ఆక్రమణలు ఉన్న సమయంలో ట్రాఫిక్ ఇబ్బందిలతో కూడిన వీడియో ఫుటేజీ, ప్రస్తుతం ఆక్రమణల తొలగించిన తర్వాత ట్రాఫిక్ పరిస్థితికి సంబంధించిన వీడియోలను మంత్రికి చూపించారు. ఆక్రమణల తొలగింపుతో కేవలం పదిశాం పనిమాత్రమే పూర్తయిందని, ఇంకా 90 శాతం పనులు మిగిలి ఉన్నాయన్నారు. దసరా నాటికి కనకదుర్గనగర్ నుంచి రథంసెంటర్ వరకు ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకుని కీలక మార్పులు చేయనున్నట్లు మంత్రికి, ఈవో వివరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రౌడీషీటర్లకు ఫింగర్ ప్రింట్ డివైస్‌తో అటెండెన్స్ తీసుకుంటున్నట్లు ఎస్ఎన్‌పురం పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు షబ్బీర్, సౌజన్య తెలిపారు. స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐలు మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడకుండా కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచేందుకు ఫేస్ రికగ్నజేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఫింగర్ ప్రింట్ డివైసర్ ద్వారా రౌడీషీటర్ల అటెండెన్స్ తీసుకున్నారు.

ఓంకార్ ఆశయాలు సాధించాలి


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు):దేశంలో సామాజిక న్యాయం కమ్యూనిస్టుల ఐక్యతే కర్తవ్యంగా మాజీ ఎమ్మెల్యే ఓంకార్ ఆశయాలు సాధించాలని ప్రొఫెసర్ మార్క్స్ శంకర్ నారాయణ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఎంసీపీఐ (యు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికవర్గ అగ్రగామి దళం, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణకర్త, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా వర్తమాన రాజకీయ పరిస్థితులు–కమ్యూనిస్ట్ ఉద్యమ ఐక్యత–సామాజిక న్యాయం–కర్తవ్యాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మార్క్స్ శంకర్ నారాయణ, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా మార్క్స్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓంకార్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. అదే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళులన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత ఉన్మాదులు ఏ రూపంలో ఉన్న వ్యతిరేకంగా పోరాటం చేయాలని తెలిపారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను ఎప్పటికప్పుడు గ్రహించి ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జెల్లీ విల్సన్, తెలంగాణ ఎంసీపీఐ (యు) రాష్ట్ర కార్యకార్శి గాదగోని రవి, సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ నాయకుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోసాన్ని నిలదీయాల్సిందే


వెలంపల్లిని కలిసిన వివిధ క్లస్టర్ల కమిటీల్లోని నాయకులు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జులై రెండో తేదీ నుంచి నిర్వహించనున్న 'చంద్రబాబు ష్యూరిటీ –మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇటీవల పశ్చిమ నియోజకవర్గంలో వివిధ క్లస్టర్లకు నియమితులైన నేతలు, స్థానిక కార్పొరేటర్లు, క్లస్టర్ల అధ్యక్షులు ఆదివారం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి వారిని సత్కరించారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలంతా నిలదీయాలని కోరారు. పార్టీలో పదవులు పొందిన ప్రతిఒక్కరు పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేయాలని కోరారు. చంద్రబాబు ఇప్పటికే భయం పట్టుకుందన్నారు. అక్రమకేసులు పెట్టి పార్టీ కార్యకర్తలను ఆపలేరన్నారు. ప్రజలలో జగన్‌కు ఉన్న ఆదరణ చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని, అందుకే జగన్‌పై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు కేసరి కృష్ణారెడ్డి, బంక చాముండేశ్వరి, నాయకులు సరగడ శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు అలాగే అనుబంధ విభాగ అధ్యక్షులుగా నియమితులైన జగిలింకి రామ్‌కుమార్ (కిషోర్), బంక తేజలు వెలంపల్లి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

వైభవంగా పోలేరమ్మ జాతర


అమ్మవారికి పొంగళ్లు తెస్తున్న సూరసాని రామిరెడ్డి దంపతులు, భక్తులు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామదేవత పోలేరమ్మకు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం పొంగలి నివేదన చేశారు. పోలేరమ్మ వెలసి 39ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమ్మవారి ఆలయలో రెండు రోజులుగా విశేష పూజలు చేస్తున్నారు. చివరిరోజు ఆదివారం మేళతాళాలు, కొమ్ముబూరల నడుమ దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి ఇంటి వద్ద నుంచి పొంగలిపాత్రలతో ప్రారంభమైన ఊరేగింపు అమ్మవారి గుడి వరకు సాగింది. అనంతరం రామిరెడ్డి కుటుంబసభ్యులు, ఊర్మిళానగర్ ప్రజలు పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. సాయంత్రం బొల్లావులు, భక్తుల కోలాట ప్రదర్శనలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలేరమ్మ దేవస్థానం అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి మాట్లాడుతూ మూడు దశాబ్దాలకుపైగా పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలేరమ్మ దేవత చల్లని చూపులతోనే ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలేరమ్మ దేవస్థానం కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మాగం ఆత్మారాము తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో నృత్యాలు చేస్తున్న మహిళా భక్తులు


బోనాలు తీసుకొస్తున్న భక్తులు





కోలాహలంగా బోనాలు

ఆషాఢమాసం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మకు హైదరాబాద్‌లోని భాగ్యనగర్ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనాన్ని సమర్పించింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పోతురాజు విన్యాసాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో ఆనందోత్సాహాలతో ఉండాలని అమ్మవారిని పూజించారు. జగన్మాతకు జేజేలు పలుకుతూ భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కళాకారులు సాంస్కృతిక వారథులు



విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారథులని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు తెలిపారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం సినీ సంగీత విభావరి, గాయకుడు మేకల పురోషత్తమ ప్రసాద్‌కు బహుంగళ కళానిధి పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ గాయకుడు ప్రసాద్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావు సంస్థ లక్ష్యాలను వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. గాయనీ గాయకులు పలు చిత్ర గీతాలను ఆలపించారు. పురుషోత్తమ ప్రసాద్‌కు బహుంగళ కళానిధి పురస్కారం అందించారు.